ప్రజాశక్తి

సోమవారం 19 ఆగస్టు 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

తాత్కాలిక భవనాల్లోకి

ఇఎస్ఐ ఆస్పత్రి

- అత్యాధునిక సదుపాయాలతో తిరిగి 100 పడకలు ఏర్పాటు
- 24 గంటలూ ఎమర్జెన్సీ సేవలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నూతనంగా నిర్మించిన తాత్కాలిక భవనాల్లోకి విజయవాడ గుణదల ఇఎస్ఐ ఆస్పత్రిని మార్పు చేస్తున్నారు. ఇఎస్ఐ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించిన ఈ నూతన తాత్కాలిక భవనాలకు ప్రారంభోత్సవం చేయనున్నారు. పూర్తి శిథిలావస్థకు చేరిన భవనంలో ఇప్పటి వరకు ఇఎస్ఐ ఆస్పత్రి కొనసాగింది. పాత భవనంలో గతంలో 100 పడకలతో ఇన్‌పేషెంట్ వైద్య సేవలు, ఓపీ సేవలు ఉండేవి. అయితే కోవిడ్ సమయంలో ఇన్‌పేషెంట్ వైద్య సేవలను నిలుపుదల చేశారు. ఇఎస్ఐతో టైయప్ అయిన ఆస్పత్రులకు రోగులను రిఫర్ చేస్తున్నారు. ప్రస్తుతం కేవలం ఓపీ సేవలను (మిగతా 2లో)

నేడు ప్రారంభోత్సవం

ఇఎస్ఐ ఆస్పత్రి తాత్కాలిక నూతన భవనాలను సోమవారం రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు, బాయిలర్స్ శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక, కర్మాగారాలు, బాయిలర్స్, ఐఎంఎస్ శాఖల రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి, ఎం.ఎం.నాయక్, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన, ఇఎస్ఐసి ప్రాంతీయ సంచాలకులు ఎ.వేణుగోపాల్, ఎంపిలు కేశినేని శివనాథ్, వి.బాలశౌరి, ఎంఎల్‌ఎ గద్దె రామమోహనరావు, జడ్‌పి చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొంటారు.

చిన్నారి మైనా మృతదేహాన్ని సందర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

విద్యుత్, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

- విజయవాడలో 18 నెలల చిన్నారి దుర్మరణం
- సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ) : విజయవాడలో విద్యుత్, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా 18 నెలల ఓ గిరిజన బాలిక దుర్మరణం పాలైంది. విజయవాడ రాజరాజేశ్వరి పేటలో నివాసం ఉంటున్న కుంభా మైనా (18 నెలలు) శనివారం రాత్రి విద్యుద్ఘాతంలో తీవ్రంగా గాయపడింది. విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరణించింది. విద్యుత్ మీటర్ల బాక్స్ వద్ద వైర్లు చల్లాచెదురుగా పడి ఉన్నాయని, ఇంట్లో ఆడుకుంటున్న చిన్నారి ఆ వైర్లను తాకడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. చిన్నారి తండ్రి ఆటో డ్రైవర్ కాగా, తల్లి చిత్తుకాగితాలు ఏరుకుని జీవనం సాగిస్తున్నారు. విద్యుత్, మున్సిపల్ అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతోనే చిన్నారి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి మృతదేహాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, జిల్లా నాయకులు టి.ప్రవీణ్ సందర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, ప్రమాదాలు అరికట్టాలని అధికారులను డిమాండ్ చేశారు. ప్రమా దాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ ప్రమాదాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు గగ్గోలు పెట్టారు. ఈ విషయాన్ని బాబురావు మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారుల దష్టికి తీసుకెళ్లారు. అనంతరం విద్యుత్ ప్రమాదాల నుండి ప్రజల ప్రాణాలు కాపాడాలని, బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ స్థానికులు ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనకు బాబూరావు మద్దతు తెలిపారు. ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం అజిత్ సింగ్‌నగర్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు బిఎన్ఎస్ఎన్, సెక్షన్- 194 ప్రకారం కేసు నమోదు చేశారు.

విద్యుత్‌కు అంతరాయం లేకుండా చర్యలు

- ప్రజాశక్తితో విజయవాడ సర్కిల్ విద్యుత్ ఎస్ఇ మురళీమోహన్
- సకాలంలో వినియోగదారులు బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి
- వర్షాకాలంలో ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - విజయవాడ : సకాలంలో పన్నులు చెల్లించి, విద్యుత్ సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఎపిసిపిడిసిఎల్ విజయవాడ ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎ.మురళీమోహన్ కోరారు. ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్‌కు అంతరాయం కలకుండా విద్యుత్ లైన్లకు అడ్డున్న వాటిని క్లియర్ చేస్తూ, వీస్తున్న గాలి, వానలకు వాలి వంగిన, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, లైన్లను ఎప్పటికప్పుడు క్లియరెన్స్ చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను క్రమబద్దీకరణ చేస్తున్నట్లు ఎస్ఇ వివరించారు. విద్యుత్ సంస్థ, దాని పరిస్థితిపై ప్రజాశక్తికి ఎస్ఇ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న : ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్‌కు అంతరాయం లేకుండా తీసుకుంటున్న జాగ్రత్తలు ఏమిటి?

ఈ వర్షాకాలంలో ఎక్కడయినా విద్యుత్ లైన్లు దెబ్బతినకుండా, ఒక వేళా దెబ్బతిన్నా అటువంటి వాటిని తక్షణమే గుర్తించి, మరమ్మతు పనులు చేయించి, విద్యుత్ సరఫరాలో (మిగతా 2లో)

హంసలదీవి బీచ్‌లో విషాదం

వివరాలు మెయిన్‌లో...

కిడ్నీ వ్యాధి సమస్యలపై

సిపిఎం నేతల పాదయాత్ర

- బాధితుల నుండి వివరాల సేకరణ

బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఎ.కొండూరు : ఏ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సిపిఎం ఆధ్వర్యాన పలు గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. మండలంలోని చైతన్య నగర్, మత్రయా తండా, చీమలపాడు, పెద్ద తండా, వెంకట తండా గ్రామాల్లో పాదయాత్ర సాగింది. డయాలసిస్ పేషెంట్లు, కిడ్నీ పెషేంట్ల నుండి వివరాలు సేకరించారు. ఎన్టీఆర్ జిల్లా ఏకొండూరు, గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట, మైలవరం తదితర మండలాల్లో తీవ్రంగా ఉన్న కిడ్నీ వ్యాధి సమస్య పరిష్కారానికి 2017 నుండి సిపిఎం, వివిధ ప్రజాసంఘాలు అధ్యయనం చేసి అనేక రూపాల్లో సుదీర్ఘకాలంగా నిరంతర పోరాటాలు (మిగతా 2లో)

కిడ్నీ వ్యాధికి మరొకరు బలి

- ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి

కిడ్నీవ్యాధితో ఏ.కొండూరు మండలం అడ్డరోడ్డు తండాకు చెందిన బాణావతి పగడమ్మ (65) శని వారం రాత్రి మరణించింది. డయాలసిస్ చేయించు కుంటూ విజయవాడలో ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెం దింది. ఆదివారం సిపిఎం నాయకులు తండాకు వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరావు, మండల నాయకులు పి.ఆనందరావు, వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వి. నాగరాజు, ఏ.కొం డూరు మండల నాయ కురాలు భూక్య జమ లమ్మ, సిఐటియు జిల్లా నాయకులు బలగాని వెంకటే శ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా నాయ కులు ఎం.సోమేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కుమార్ నాయక్ పాల్గొన్నారు.

విజయవాడలో జాతీయ క్రీడలకు కృషి

● ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వాకర్స్ సమావేశంలో ఎంపి కేశినేని చిన్ని

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : 2027లో విజయవాడలో జాతీయ క్రీడలు జరగను న్నాయని ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. తెలిపారు. వచ్చే ఐదేళ్లలో రాజధాని అమరావతితో పాటు విజయవాడ నగరాభివద్ధి వేగంగా జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం ఆ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపి కేశినేని శివనాథ్... ఎంఎల్ఎ గద్దె రామ్మోహన్‌తో కలిసి పాల్గొన్నారు. అసోసియేషన్ సభ్యులు ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ విజయవాడ నగరాభివద్ధితోపాటు క్రీడల అభివృద్ధికి కూడా కషి చేయనున్నట్లు తెలిపారు. అమరావతికి ఓ గుర్తింపు తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2027లో విజయవాడలో జాతీయ క్రీడలు నిర్వహించేలా కృషి చేస్తున్నారని చెప్పారు. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వస్తుందన్నారు. ఇక మంగళగిరిలోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియాన్ని ఆరునెలల్లో ప్రారంభిస్తామని ప్రకటించారు. నగరంలో స్టేడియం నిర్మానానికి స్థలం లేనందున క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేసేందుకు కషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే విజయవాడలో అభివద్ధికి కృషి చేస్తామన్నారు. డ్రైనేజీలు, రోడ్ల సమస్యలను పరిష్కరించడంతోపాటు ఫ్లైవోవర్లు నిర్మిస్తామని తెలిపారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకులకు వసతులు, కనకదుర్గ ఆలయంలో భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటా మన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను ఎంపి కేశినేని శివనాథ్ సహకారంతో త్వరలోనే పరిష్కరి స్తామన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఒక ప్రాజెక్ట్ తయారు చేయించి నిధులు కేటాయించేందుకు కషి చేస్తానన్నారు. విజయవాడ నగర అభివద్ధికి సీనియర్ సీటిజన్స్ సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సూరపనేని నాగేశ్వరరావు, కార్యదర్శి గుత్తికొండ సతీష్, ప్రిన్సిపాల్ విజయసారథి, హెచ్‌ఎమ్ పి.శ్రీనివాసరావు, రిటైర్డ్ హెచ్‌ఎమ్. వెంకారెడ్డి, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, చెన్నుపాటి ఉషారాణి, ఎన్టీఆర్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ చలసాని రమణ టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్లూరి దర్శిత్, యేర్నేని వేదవ్యాస్, విష్ణు బిల్డర్స్ విష్ణు, కాటంరాజు, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

కేశినేని చిన్నిని సత్కరిస్తున్న దృశ్యం

మెకానిక్‌లు, డిస్ట్రిబూటర్లతో మాట్లాడుతున్న డిసిపి చక్రవర్తి

శబ్ద కాలుష్యం చేస్తే చర్యలు తప్పవు

● ట్రాఫిక్ డిసిపి చక్రవర్తి

ప్రజాశక్తి-విజయవాడ : నగరంలోని ద్విచక్ర వాహన మెకానిక్‌లకు, డిస్ట్రిబుటర్లకు ట్రాఫిక్ డిసిపి కే.చక్రవర్తి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. రహదారి భద్రతా నియమాలు, ఎంవి యాక్ట్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ నగరంలో యువకులు తమ ద్విచక్ర వాహనాలకు శబ్ద కాలుష్యం చేసే సైలెన్సర్లు బిగించి రహదారులపై తిరుగుచూ ప్రజలకు ఇబ్బంది కలగచేయొద్దని హెచ్చరించారు. ప్రజలను భయ బ్రాంతులకు గురిచేస్తున్న వారికి నోటీసులు ఇచ్చి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కంపెనీ అమర్చిన సైలెన్సర్ తప్ప, వాహనదారుడు ఆన్‌లైన్‌లో కొన్నవి, ఇతర రాష్ట్రాల నుండి కొన్నవి శబ్ద కాలుష్యం కలుగ చేసే వాటిని బిగించొద్దని హెచ్చరించారు. శబ్ద కాలుష్యం చేసే సైలెన్సర్లు మార్చాలని వాహనదారులు ఒత్తిడి చేస్తే వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

21 మందికి జరిమానా

ప్రజాశక్తి-విజయవాడ : మద్యం సేవించి వాహనాలు నడిపే చోదకులపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 6వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 21 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన చోదకులను సంబంధిత ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్ట్‌లో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి లెనిన్ బాబు ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున, మిగిలిన 16 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

పేకాట శిబిరంపై సిసిఎస్ పోలీసుల దాడి

● 25 మంది అరెస్టు ● రూ.3 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - కంకిపాడు : కృష్ణాజిల్లా పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడిగడప మున్సిపాల్టీ పోరంకి నారాయణపురం కాలనీలో నిర్వహిస్తున్న రెండు పేకాట శిబిరాలపై ఆదివారం సిసిఎస్ పోలీసులు దాడి చేశారు. 25 మంది పేకాట రాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.2.80 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పోలీసులకు చిక్కినవారిలో కీలక ప్రజాప్రతినిధి అనుచరులతోపాటు బడాబాబులు ఉన్నట్లు తెలిసింది. స్థానికుల సమాచారంతో పోలీసులు పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. సిద్ధార్థ ఫార్మసీ కళాశాలకు చెందిన ప్రముఖుడు, పలువురు ఎంఎల్‌ఎ అనుచరులు ఉన్నట్లు తెలిసింది.

21న డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు

ప్రజాశక్తి - తెనాలి : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీకి పోటీపడుతున్న అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ నాయకులు ఎమ్‌డి గయానుద్దౌలా, టిఎస్ఎన్ఎల్ మల్లేశ్వరరావు, ఎస్కే అహ్మద్ హుస్సేన్ ఆదివారం తెలిపారు. స్థానిక కొత్తపేటలోని ఎన్జీవో కళ్యాణమండపంలో ఈనెల 21న సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు సదస్సు ఉంటుందన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని అభ్యర్థులకు పరీక్ష విధానం, చదవాల్సిన పుస్తకాలు, సమయపాలన వంటి మెలకువలు వివరిస్తారని పేర్కొన్నారు. సదస్సుకు హాజరైన అభ్యర్థులకు 160 పేజీల ఎడ్యుకేషన్ సైకాలజీ మెటీరియల్ ఉచితంగా అందిస్తారని, డీఎస్సీ పరీక్షకు ఇది ఎంతగానో దోహద పడుతుందని తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.

మొదటిపేజీ తరువాయి

పగడమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

కిడ్నీ వ్యాధి సమస్యలపై సిపిఎం నేతల పాదయాత్ర

నిర్వహిస్తున్నాయి. దీంతో ప్రభుత్వాలు కొన్ని ఉపసంహరణ చర్యలు చేపట్టాయి. అయితే అవి అరకొర చర్యలు కావటంతో వ్యాధి బాధితులు తగ్గకపోగా పెరిగిపోతున్నారు. నూతన తరాలకు చాపక్రింద నీరులాగా విస్తరిస్తున్నది. యువతీ యువకులు వ్యాధి బారిన పడుతున్నారు. ఇది ప్రమాదకరంగా మారింది. వ్యాధిబారినపడి ఇప్పటివరకు ఈ ప్రాంతాల్లో 300 మందికి పైగా చనిపోయారు. వేలాది మంది రోగులు లక్షలాది రూపాయలు అప్పులు చేసి వైద్యం చేయించుకుంటూ, ఉన్న కొద్దిపాటి భూములు, ఇళ్లు అమ్ముకొంటున్నారు. కొద్ది రోజుల క్రితం గంపలగూడెం మండలం అనుముల్లంక గ్రామంలో ఒకేరోజు ఇద్దరు చనిపోయారు. ఇలాంటి కిడ్నీ వ్యాధి బాధిత మరణాలు ఈప్రాంతంలో రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈదశలో వ్యాధిని పూర్తిగా అరికట్టటానికి సమగ్ర చర్యలు తీసుకోవాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో కిడ్నీ హాస్పిటల్ నిర్మించాలని, దానికి అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే కేటాయించాలని, శుద్ధి చేసిన కష్ణా జలాలను కుళాయిల ద్వారా ఇంటింటికీ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనికి ప్రభుత్వం నిధులు వెంటనే కేటాయించాలని, ఈలోగా సమస్య ఉన్న అన్ని గ్రామాలకు ట్యాంకుల ద్వారా ప్రతి రోజు కష్ణా నీటిని పంపిణీ చేయాలని, ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, క్రియాటిన్ 2 పాయింట్లు దాటిన వారందరికీ నెలకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని, వ్యాధి బాధితులకు అన్ని రకాల మందులు ఇవ్వాలని కోరారు. డయాలసిస్ పేషేంట్లకు ఇస్తున్న పెన్షన్ రూ.20 వేలకు పెంచాలని, కొత్తగా డయాలసిస్ (గత 6నెలలుగా) చేయించుకుంటున్న వారికి డయాలసిస్ పెన్షన్ వెంటనే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కిడ్నీవ్యాధితో మరణించిన వారి కుటుంబాలకు ఎకరం భూమి, మట్టి ఖర్చులకు రూ.25 వేలు ఇవ్వాలని, వ్యాధిగ్రస్తులందరికీ పౌష్ఠికాహారం అందించాలని, ఇంటింటికీ విష జ్వరాలతో ఉన్న ప్రజలను కాపాడేందుకు జిల్లా కలెక్టర్ వెంటనే సమీక్షించి, యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.సోమేశ్వరరావు, నాగరాజు, వెంకటేశ్వరరావు, ఆనందరావు, సిపిఎం ఏ.కొండూరు మండల కార్యదర్శి జెట్టి.వెంకటేశ్వరరావు, జవలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు అంతరాయం లేకుండా చర్యలు

అంతరాయం కలగకుండా ఉండటానికి వీలుగా ఎక్కడికక్కడ ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేశాం. ఏదైనా అంతరాయం కలిగితే పునరుద్ధరించే చర్యలు తీసుకున్నాం. గృహ కనెక్షన్లు, పరిశ్రమలు, వ్యవసాయ కనెక్షన్లు ఎక్కడయినా మరమ్మతులకు గురైతే తక్షణమే చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్ వినియోగదారులు కూడా తగిన జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది.

ప్రశ్న : వర్షాకాలంలో ప్రమాదాలు జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి?

సహజంగా ప్రతి వర్షాకాలంలో వీచే గాలులకు, బలమైన వర్షాలకు అనుకోకుండా విద్యుత్ తీగలు దెబ్బతిని పడిపోయినా, విద్యుత్ సరఫరా ఉన్నా... అటువంటి చోట్ల వినియోగదారులు, ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలి. పశువులను కూడా జాగ్రత్తగా కట్టడి చేయాల్సి ఉంటుంది. గమనించి విద్యుత్ వైర్లను దాటాల్సి ఉంటుంది. అనుకోని విధంగా ప్రమాదవశాత్తు ఇటువంటి ప్రమాదాలు ఒకటి అర జరుగుతూనే ఉన్నాయి. వినియోగదారులు, ప్రజలు చాలా జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ లైన్ల మరమ్మతుల సమయంలో సంస్థలోని సిబ్బంది కూడా అన్ని రకాలుగా జాగ్రత్తలు పాటించాలి.

ప్రశ్న: విజయవాడ సర్కిల్ పరిధిలో ఉన్న సబ్‌స్టేషన్లు ఎన్ని?

33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లు 306 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 18,94,333 ఎల్‌టి సర్వీసు కనెక్షన్లు ఉండగా, 1740 హెచ్‌టి లైన్ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో రోజుకు 15 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉంటుంది.

ప్రశ్న : పంచాయతీల విద్యుత్ బకాయిలు ఎంత వరకు ఉన్నాయి?

విద్యుత్ వినియోగించుకొని, బకాయిలు చెల్లించని పంచాయతీలు చాలా ఎక్కువుగానే ఉన్నాయి. ఇప్పటి వరకు రూ.517 కోట్ల వరకు పంచాయతీల నుంచి విద్యుత్ సంస్థకు చెల్లింపులు చేయాల్సి ఉంది. పలుసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నాం. కొంత వరకు విడతల విడతలుగా బకాయిలను విడుదల చేస్తున్నారు.

ప్రశ్న: విద్యుత్ బిల్లుల వసూలుకు తీసుకుంటున్న చర్యలు?

పెండింగ్ విద్యుత్ బిల్లుల వసూలుకు ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి, ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఎల్‌టి, హెచ్‌టి సర్వీసులతోపాటు పంచాయతీల్లో పేరుకుపోయిన బకాయిల వసూలుకు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాం. ఎప్పటికప్పుడు అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ బకాయిల వసూలుకు కృషి చేస్తున్నాం. విద్యుత్ వినియోగదారులు కూడా తమ తమ పరిధిలో చెల్లించాల్సిన బిల్లులను జరిమానాలు, విద్యుత్ కనెక్షన్లు తొలగింపు వరకూ వెళ్లకుండా సకాలంలో చెల్లించాలి.

ప్రశ్న : కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలేమిటి?

విజయవాడ లాంటి నగరాలతోపాటు పట్టణాలు, పంచాయతీల విస్తరణక అనుగుణంగా విద్యుత్ డిమాండ్ పెరుగుతూనే ఉంటుంది. దానికనుగుణంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటుకు ప్రణాళికా బద్దమైన చర్యలు తీసుకుంటున్నాం.

తాత్కాలిక భవనాల్లోకి ఇఎస్ఐ ఆస్పత్రి

మాత్రమే కొనసాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన భవనాల్లో మళ్లీ 100 పడకలతో ఇన్‌పేషెంట్ వైద్య సౌకర్యాలను కూడా ఏర్పాటు చేశారు. అలాగే ఓపీ సేవలను నూతన భవనాల్లోనే అందించేందుకు ఏర్పాట్లు చేశారు. అంతేగాక 24 గంటలూ పూర్తిస్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్ అందుబాటులో ఉంటారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.జ్యోతి, ఆస్పత్రి ఆర్ఎంఒ, సివిల్ సర్జన్ డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్ తెలిపారు. ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, ఇఎన్‌టి, డెర్మటాలజీ, సైకియాట్రీ విభాగాలకు సంబంధించిన వైద్యులు పూర్తి సమయం అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రత్యేకంగా అంబులెన్స్ సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాధారణ వైద్య సేవలతోపాటు క్రమంగా కొన్ని సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందించనున్నామని తెలిపారు.

ఐవిఎం సురేష్ సేవలు స్ఫూర్తిదాయకం : ఎంఎల్ఏ

ప్రజాశక్తి-చల్లపల్లి : సమాజ సేవ చేస్తున్న ఐవీఎం సురేష్ సేవలు స్ఫూర్తిదాయకమని అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం పురిటిగడ్డలోని ఐవీఎం హెూంలో ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ – రోజా దంపతుల ఆధ్వర్యంలో రూ.40 లక్షలు వ్యయంతో 233 మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్, బీ.టెక్ విద్యార్థులకు లాప్ టాప్స్ పంపిణీ, స్కూల్, కాలేజ్ విద్యార్థులకు ఫీజులు సహాయంగా అందించే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో దశాబ్దా లుగా విస్తృత స్థాయిలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏకైక సంస్థ ఐవీఎం అన్నారు. అనాథలకు, పేదలకు కల్పతరువుగా ఐవీఎం సంస్థ నిలుస్తోందన్నారు. అనాథలను కన్నబిడ్డలతో సమానంగా చూసుకుంటూ ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్న తీరు ప్రశంసనీయమన్నారు. ఐవీఎం సహాయంతో చదువుకుంటున్న పేద విద్యార్థులు ఉన్నత శిఖరాలు అందుకోవాలన్నారు. ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ మాట్లాడుతూ 23 సంవత్సరాల నుండి తమ హెూమ్ ద్వారా వందలాది మంది విద్యార్థులు గ్రాడ్యుయేట్లు అయ్యారన్నారు. ప్రతి నెల 94 మంది పేద వద్దులకు, వితంతువులకు వస్త్రదానం, నెలవారీ సరుకులు అందిస్తున్నట్లు తెలిపారు. ఇంకా మరెన్నో సేవలు సమాజం అవసరాలు గుర్తించి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ పేద విద్యార్థులకు ఐవీఎం స్కాలర్ షిప్స్, లాప్ టాప్స్ అంద చేశారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, కాకినాడ ఇంటెలిజెన్స్ డీఎస్పీ ఎన్.ఎస్.వీ.కే.దుర్గారావు, ఐవీఎం బోర్డు సభ్యులు ఎన్.ఫణి, జీ.ప్రసాద్, విశ్రాంత డీఎస్పీ కే.హరి రాజేంద్రప్రసాద్, ప్రముఖులు యార్లగడ్డ శ్రీనివాసరావు, చల్లపల్లి ఉప సర్పంచ్ రాజకుమార్ పాల్గొన్నారు.

సాయం పొందిన విద్యార్థులతో బుద్ధప్రసాద్, ఐవీఎం సురేష్ తదితరులు

అక్రమ కట్టడాలు కూల్చివేత

ప్రజాశక్తి- పెడన : మున్సిపల్ పరిధిలోని అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలను కమిషనర్ వెంకటరామయ్య ఆదివారం కూల్చి వేశారు. స్థానిక 214 జాతీయ రహదారికి అనుకుని ఉన్న గుడివాడ వెళ్ళు రోడ్లో ల్యాండ్ కన్వర్షన్, అలాగే మున్సిపల్ టౌన్ ప్లానింగ్ నుంచి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇల్లును ఆయన సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా వెంకట రామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరు అక్రమ కట్టడాలు కట్టిన ఉపేక్షించేది లేదన్నారు. ఇలాంటి కట్టడాల నిర్మిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కూల్చివేతలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు కూలుస్తున్న దృశ్యం

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి-మొవ్వ : కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో కూచిపూడి నాలుగు రోడ్ల కూడలిలో ఎస్సై సుబ్రహ్మణ్యం నేతృత్వంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో డ్రైవింగ్ లైసెన్స్ లేక పోవడం, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే వ్యక్తులకు ఆన్లైన్లో చలానాలు విధించారు. ఈసందర్భంగా ఎస్సై సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా బండి నడప రాదని, 18 సంవత్సరాల నిండని పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని అన్నారు. డ్రైవింగ్ చేస్తూ ఫోను మాట్లాడరాదని, హెల్మెట్ లేకుండా వెహికల్ నడప రాదని వాహనదారులకు సూచించారు.

గ్రామాల్లో వీధిలైట్లకు నిధులు కటకట

- **దిక్కుతోచని స్థితిలో సర్పంచులు**

ప్రజాశక్తి-గన్నవరం : ప్రభుత్వం మారిన పంచాయతీలకు నిధులు ఇవ్వకపోవడంతో వీధిలైట్లు వేసే పరిస్థితి లేదని సర్పంచులు చెబుతున్నారు. టిడిపి అధికారంలోకి రాగానే నిధులు దండిగా వస్తాయని, లైట్లు వేయడంతో పాటు అభివృద్ధి పనులు చేయవచ్చని ఆశించారు. నెలలు గడుస్తున్న నిధులు రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గన్నవరం నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల్లో వీధి దీపాల నిర్వహణ దయనీయంగా మారింది. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల్లో 84 పంచాయితీలు ఉన్నాయి. అందులో 20 మేజర్ పంచాయతీలున్నాయి. మిగిలినవన్నీ మైనర్ పంచాయతీలే. మేజర్ పంచాయతీల్లో ఆర్థిక పరిస్థితి బాగున్న మైనర్ పంచాయతీల్లో డబ్బులు లేని పరిస్థితి నెలకొంది. విద్యుత్తు ఆదాతో పాటు పంచాయతీలపై నిర్వహణ భారం తగ్గించేందుకు గతంలోనే స్తంభాలకు ఎస్ఈడీ దీపాలు బిగించారు. నిర్వహణ బాధ్యతలను ఇంధన సామర్థ్య సేవల సంస్థకు అప్పగించారు. ఎస్ఈడీ దీపాల వినియోగం ద్వారా ఆదా అయిన సొమ్మువాయిదాల రూపంలో లైట్లు సరఫరా చేసే సంస్థకు చెల్లిస్తే సరిపోతుందని అధికారులు అప్పట్లో చెప్పారు. కొంతకాలం పాటు సక్రమంగా నిర్వహించినా.. ఆ తర్వాత చేతులెత్తేశారు. దీంతో ఇవి ఎక్కడికక్కడ మూలనపడ్డాయి. వీటి స్థానంలో తిరిగి చిన్న బల్బుల కొనుగోలు చేశారు. గతంలో వాడిన ఎల్డీ దీపాలకు చేసిన ఖర్చును ప్రస్తుతం పంచాయతీల నుంచి వైకాపా ప్రభుత్వం తీసుకుంది.ఐదేళ్లుగా ఒక్క రూపాయి ఇచ్చింది లేదు..ముఖ్యమంత్రిగా జగన్ అధికార పీఠం ఎక్కిన తరువాత గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ఇచ్చింది లేదు. రెండేళ్లుగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 14, 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా సర్పంచులు, అధికారులకు కూడా తెలియకుండా దారి మళ్లించింది. దీంతో గ్రామాల్లో ఎక్కడా కనీస అభివద్ధి అనేది లేకుండాపోయింది. వీటిలో అధిక భాగం విద్యుత్తు ఛార్జీల రూపంలో తిరిగి రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాకు జమ చేసుకుంది. మిగిలిన వాటిలో కూడా ఎల్ ఈడీ దీపాల నిర్వహణ పేరుతో మరికొంత తీసేసుకుంది. దీంతో గ్రామాల్లో కనీస వసతులు కల్పించలేకపోతున్నామని సర్పంచులు వాపోతున్నారు.

నిలువెల్లా నిర్లక్ష్యమే..

గ్రామ పంచాయతీలపై వీధి దీపాల నిర్వహణ, విద్యుత్తు బిల్లుల భారం తగ్గించాలనే ఉద్దేశంతో గత తెదేపా ప్రభుత్వం 2019లో రాష్ట్రవ్యాప్తంగా వీధి దీపాలుగా ఎస్ఈడీ బల్బులు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ చాలా చౌకగా ఉండటం, విద్యుత్తు వినియోగం కూడా పెద్దగా ఉండకపోవడంతో వీటిని వినియోగిస్తే ప్రజాధనం ఆదా అవుతుందని వీటిని ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యతను ఈసీఎల్ కార్పొరేషన్, నెడ్క్యాప్ సంస్థలకు అప్పగించారు. 2019 తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వీరికి నిర్వహణ నిధులు సక్రమంగా ఇవ్వకపోవడంతో వీరు 2020లో తమ వల్ల కాదని చేతులెత్తేశారు. ఇప్పటి వరకు వైకాపా గ్రామాలో ఒక్క ఎద్దుడీ బలలుకు కూడా మరమ్మతులు తమ వల్ల కాదని చేతులెత్తేశారు. ఇప్పటి వరకు వైకాపా గ్రామాల్లో ఒక్క ఎస్ఈడీ బల్బుకు కూడా మరమ్మతులు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో అనేక గ్రామాల్లో చీకట్లు అలముకున్నాయి. ప్రజల బాధలు చూడలేని కొందరు సర్పంచులు సాధారణ నిధులు నుంచి ఎస్ఈడీ బల్బుల స్థానంలో మళ్లీ స్తంభాలకు సాధారణ విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. 2021 ఏప్రిల్లో పంచాయతీల్లో కొత్త పాలక వర్గాలు కొలువుదీరాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామాల అభివద్ధికి పంచాయతీ ఖాతాలకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయనేలేదు. ప్రభుత్వం ఎల్ఈడి లైట్ల నిర్వహణ గాలికొదిలేయడంతో ప్రస్తుతం నియోజకవర్గంలో 40 శాతానికిపైగా వెలగడం లేదు. కనీస మరమ్మతులు కూడా చేయించే పరిస్థితి లేదు. వెలగని దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేవారు కూడా కరవయ్యారు. ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం వాడేసుకోవడంతో సర్పంచులుసైతం వీధి దీపాలు నిర్వహించలేని స్థితికి చేరుకున్నారు. విధిలేని పరిస్థితుల్లో ఎస్ఈడీ దీపాలు వెలగని కొన్నిచోట్ల చిన్న బల్బులు ఏర్పాటు చేశారు. వీటి నుంచి సరిపడా వెలుతురు రాక గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు.

డ్రెయిన్‌లో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామంలో గల శ్రీమన్నారాయణ స్వామి ఆలయం దగ్గరలో ఉన్న లింగన్న కోడు కాలువలో శనివారం సాయంత్రం వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసు కున్నారు. మాచర్ల బెన్ను (58) అనే వ్యక్తి గేదలు శుభ్రపరచుకుని పైకి ఎక్కే క్రమంలో కాలువలో గల్లంతు అయ్యారు. ఆదివారం ఉదయం మృతదేహం లభ్యం కావడంతో పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ఏరియా ఆసుపత్రికి తరలించి అనంతరం మృతిని కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించామని కోడూరు ఎస్సై శిరీష తెలిపారు.

మృతుడు మాచర్ల బెన్ను

మహిళ మృతి

ప్రజాశక్తి- పెదపారుపూడి : మండల పరిధిలోని దూల వానిగూడెం గ్రామ శివారు పంట కాలువలో సునీత అనే వివాహిత కాలువలో శవమై తేలింది. పోలీసులు తెలిపన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నక్కా రాజేష్‌కు, నక్కా సునీత భార్యభర్తలు. శుక్రవారం రాత్రి 11 గంటల 30 నిమిషాల సమయంలో దూలవానిగూడెం గ్రామ శివారు పంట కాలువలో సునీత మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. ఈ మేరకు సునీత సోదరుడు గోనె సునీల్‌కుమార్ తన అక్క సునీతను ఆమె భర్త రాజేష్ అనుమానంతో హత్య చేసి కాలువలో పడేశాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పామర్రు సీ.ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఎనిమిది మంది అరెస్టు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ రూరల్, పరిసర ప్రాంతాలలో దొంగతనాలు చేస్తున్న ఎనిమిది మంది వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి నాలుగు లక్షల 30 వేల రూపాయల విలువ గల చోరీ చేసిన సొత్తును, దొంగతనానికి ఉపయోగించే రెండు లక్షల విలువ గల టాటా ఏసీ వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించినట్లు తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంటిబాబు మాట్లాడుతూ గుడివాడ ఇన్చార్జి డిఎస్పి మహబూబ్ అబ్దుల్ సుభాని ఆధ్వర్యంలో గుడివాడ రూరల్ సిఐ సోమేశ్వరరావు పర్యవేక్షణలో రాబడిన సమాచరం మేరకు ఎనిమిది మంది దొంగలను అరెస్టు చేశామన్నారు. ఆదివారం బొమ్ములూరు శివారు వద్ద గుడివాడ పంచవటి కాలనీకి చెందిన 8 మంది కట్టా కిరణ్, షేక్ మాహబూబ్ సుభానీ, గుంజ శివయ్య, ఉప్పతల రామకృష్ణ, దాసరి గురవమ్మ, ఇస్సాక్ బేగ్‌లను అరెస్టు చేశావన్నారు. వారి వద్ద నుండి నాలుగు లక్షల 30 వేల విలువైన ట్రాన్స్ఫార్మర్ వైర్లు, మోటర్లు స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ చంటిబాబు తెలిపారు.

నేరగాళ్ళను అరెస్టు చేసిన పోలీసులు

దుర్గగుడిలో పవిత్రోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - వన్‌టౌన్ :

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానంలో ఆదివారం నుండి పవిత్రోత్సవాలు అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 18వ తేదీ నుండి 20 వరకు దేవస్థానంలో నిర్వహించు పవిత్రోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం 3.00 గంటలకు అమ్మవారికి సుప్రభాతం, తదితర కార్యక్రమాలనంతరం ఉదయం 9 గంటల నుండి దర్శనం అనుమతించారు. అనంతరం వైదిక కార్యక్రమాల్లో భాగంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామారావు సమక్షంలో ఆలయ వైదిక సిబ్బంది, అర్చకులచే ఉదయం 9 గంటల నుండి పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒ దంపతులు, వైదిక కమిటీ సభ్యులు, వేదపండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. మూడు రోజుల పాటు దేవస్థానంలో జరుగు అన్ని ఆర్జిత సేవలు (ప్రత్యక్షం, పరోక్షం)గా నిలుపుదల చేశారు. అమ్మవారికి నిర్వహించే అన్ని నిత్య కైంకర్యాలను దేవస్థాన అర్చకులు మాత్రమే నిర్వహిస్తారని ఇఒ ప్రకటనలో తెలిపారు. యాత్రికులు రద్దీ దృష్ట్యా ఇఒ సిబ్బందికి ముందస్తుగా ప్రత్యేక విధులు కేటాయించారు. 11 గంటల నుండి 1.30 గంటల వరకు దేవస్థానంలో ప్రోటోకాల్ దర్శనాలు అన్ని నిలుపుదల చేసినట్లు ఇఒ రామారావు తెలిపారు.

దుర్గమ్మ అలంకరణకు బంగారు రాళ్ళ సూత్రాలు విరాళం

ప్రజాశక్తి - వన్‌టౌన్ :

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి ఎల్ఐజిసి కాలనీ, మొగల్రాజపురం, విజయవాడకు చెందిన కొండపల్లి హరిప్రసాద్, కుటుంబ సభ్యులు అమ్మ వారికి అలంకరణ నిమిత్తం 29 గ్రాములు బరువు గల రెండు బంగారు రాళ్ళ సూత్రాలు నాన్ కోడ్‌లను ఆలయ అధికారులను కలిసి దేవస్థానానికి ఆదివారం విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాత కుటుంబానికి శ్రీ అమ్మవారి దర్శనం చేయించారు. వేదపండితుల వేదాశీర్వచనం కల్పించి, అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

గాజులతో ముత్యాలమ్మ అలంకరణ

జగ్గయ్యపేట : పట్టణంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి వీధిలో వెలసిన శ్రీ ముత్యాలమ్మ అమ్మ వారిని శ్రావణమాసం రెండో ఆదివారం గాజులతో అలంకరించారు. ఈ సందర్భంగా యాత్రికులు దేవాలయానికి వచ్చి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ ప్రెసిడెంట్ అప్పన మణికుమార్, వైస్ ప్రెసిడెంట్ నోముల శివకుమార్, సెక్రటరీ కొత్త రమేష్ కుమార్, జాయింట్ సెక్రటరీ కొంకిమళ్ల సురేష్, ట్రెజరర్ అప్పన వెంకట పిచ్చయ్య, కమిటీ సభ్యులు చేదే వెంకట శ్రీరంగం, దేవరశెట్టి నాగ ప్రసాద్, ఆరేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్‌పై ప్రత్యేక నిఘా

టూటౌన్ సిఐ కొండలరావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : గంజాయి బ్యాచ్‌పై ప్రత్యేక నిఘా పెడతామని టూటౌన్ సిఐ సి.కొండలరావు తెలిపారు. ఇటీవల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆదివారం సిఐ కొండలరావు మొదటి సారిగా మీడియాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొన్ని సమస్యాత్మక ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్ కదలికలపై దృష్టి సారిస్తామన్నారు. టూటౌన్ స్టేషన్ పరిధిలోని రూరల్ ప్రాంతమైన జక్కంపూడి తదితర ప్రాంతాల్లో దొంగతనాలు జరక్కుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఆదివారం టూటౌన్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, అనవసరమైన గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం 172 మంది రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు ఉన్నారని, అయితే నేడు 100 మంది వరకూ కౌన్సిలింగ్‌కు హాజరయ్యారని సిఐ కొండలరావు తెలిపారు. ప్రజలకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సిఐ తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న టూటౌన్ సిఐ కొండలరావు

ఉచిత వైద్య శిబిరం

పరీక్షలకు వచ్చిన పేషెంట్లకు ఓపి నమోదు కేంద్రం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : 16వ పశ్చిమ ఎంఎల్‌ఎ సుజనా చౌదరి ప్రారంభించిన మెగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం స్థానికులు సద్వినియోగం చేసుకున్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో లభించే వైద్య పరీక్షలను అందుబాటులోకి తీసుకువచ్చి గర్భాశయ ముఖద్వారా కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లు, థైరాయిడ్, టిబి, గుండె సంబంధిత వ్యాధులకు చికిత్సలు అందజేస్తున్నారు. ఎన్‌ఆర్‌ఐ వైద్య కళాశాల వ్యవస్థాపక డైరెక్టర్ అక్కినేని హాస్పిటల్స్ ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ అక్కినేని మణి ఈ వైద్య శిబిరంలో మహిళలకు చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మణి మాట్లాడుతూ ఎంఎల్‌ఎ సుజనా చౌదరి అత్యాధునిక టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలందరికీ క్వాలిటీతో కూడిన వైద్యాన్ని అందించడం శుభ పరిణామమన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో అందించే వైద్య సేవలను సాంకేతిక పరిజ్ఞానంతో అందిస్తున్నామని మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెల్త్ క్యాంప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బొమ్మకంటి వెంకటరమణ తెలిపారు. రెండో విడత శిబిరాన్ని ఈనెల 24 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు చిట్టినగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో నిర్వహిస్తామని తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

భార్యాభర్తల మధ్య గొడవలే కారణమంటున్న పోలీసులు

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు భవానీపురం హౌసింగ్ బోర్డు కాలనీ ఎంఐజి–1లో ప్లాట్ నెంబర్ 10లో గుమ్మడవల్లి శ్రీకాంత్ (28) కుటుంబ సభ్యులతో కలిసి నివాసం వుంటున్నాడు. శ్రీకాంత్ నాలుగు సంవత్సరాల క్రితం ప్రకాశం జిల్లాకు చెందిన త్రివేణి అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. ఇతను పటమటలోని హృదయాలయ హాస్పిటల్‌లో మత్తు ఇచ్చే వైద్యుని వద్ద హెల్పర్‌గా పనిచేస్తుంటాడు. మూడేళ్లగా విజయవాడ హెచ్‌బి కాలనీలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం ఇంట్లోకి వెళ్ళి తలుపులు వేసుకుని ఉరేసుకున్నాడు. భార్య లోపలకు వెళ్ళి చూడగా ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. మద్యానికి బానిసై క్షణికావేశంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు శ్రీకాంత్ తండ్రి గుమ్మడివల్లి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

ఇంట్లో ఉరేసుకుని మృతిచెంది పడి ఉన్న శ్రీకాంత్

విద్యార్థులకు గొడుగులు పంపిణీ

ప్రజాశక్తి - తిరువూరు : పేద విద్యార్థులకు తిరువూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం గొడుగులు పంపిణీ చేశారు. స్థానిక ఐడియాస్ సేవా సంస్థ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు వీటిని విద్యార్థులకు అందజేశారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఎండ వానల్లో ఇబ్బంది పడకుండా తమ క్లబ్ తరపున గొడుగులను అందజేశామని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కంచర్ల ముత్య ప్రసాద్, ఐడియాస్ డైరెక్టర్ అవ్వారి సౌరి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అన్ని దానాలలో కెల్ల అన్నదానం మహాదానమని డాక్టర్ బ్రహ్మదేశం వసంత్ కుమార్ అన్నారు. ఆదివారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శీలం భవానీ ప్రసాద్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగ వసంత కుమార్ మాట్లాడుతూ యువత సేవ కార్యక్ర మాల్లో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొండాయగుంట రాము, స్పందన సేవా సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్, బ్యాంకింగ్ యూనియన్ నాయకులు బోడి ఆంజనేయ రాజు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్ర

తిరువూరు : నియోజకవర్గానికి కృష్ణా జలాలు సరఫరా చేయాలని కోరుతూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో ప్రజారోగ్య పరిర క్షణ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ తెలిపారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పల్లెపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ మాసంలో 'కొండ దిగిన' కోడి

ప్రజాశక్తి - నందిగామ :

కొన్ని నెలలుగా కొండెక్కి కూర్చున్న చికెన్ ధరలు దిగొచ్చాయి. గత నెలలో కిలో చికెన్ రూ.280 నుంచి రూ.350 వరకు పలికిన సంగతి తెలిసిందే. దీంతో చికెన్ రేట్లు చూసి సామాన్యుడు తినలేక గుటకలు మింగి సరిపెట్టుకున్నారు. శుభకార్యాలు, ఫంక్షన్లకు కూడా తప్పనిసరియైతే తప్ప చికెన్ కొనలేని పరిస్థితి. ఇలా ఈ ఏడాది ప్రారంభం నుంచి చికెన్ రేట్లు చుక్కలు చూపిస్తూనే వచ్చాయి. కానీ అనూహ్యంగా ఈ నెల మొదటి వారం నుంచి చికెన్ ధరలు రోజురోజుకు పతన మవుతూ వచ్చాయి. ప్రస్తుతం శ్రావణ మాసం కావడంతో ఈ నెలంతా పూజలు, వ్రతాలు ఇతర కార్యక్రమాలతో మహిళలు బిజీగా ఉంటూ మాంసాహారాన్ని ఇంట్లోకి రానివ్వరు.

ఆగస్టు 5న కిలో రూ.180 ఉన్న చికెన్ ధర ఆగస్టు 11వ తేదీ ఆదివారం నాటికి రూ.150కి పడిపోయింది. ఆగస్టు 17వ తేదీ శనివారం రూ.158గా ఉంది. ప్రస్తుతం శ్రావణమాసం కావడంతో ఆదివారాలతో సహా అన్ని రోజుల్లో దాదాపు ఇవే ధరలు కొనసాగుతున్నాయి. సాధారణంగా ఆదివారాల్లో గిరాకీ ఎక్కువగా ఉంటుంది. దీంతో మిగతా రోజుల సంగతి ఎలా ఉన్నా ఆదివారం రాగానే చికెన్ రేట్లు అమాంతం పైకి ఎగబాకుతాయి. కానీ శ్రావణ మాసం కావడంతో అసలు కొనేవారే కరువయ్యారు. దీనిపై చికెన్ సెంటర్ యజమానులు మాట్లాడుతూ త్వరలోనే మళ్లీ చికెన్ ధరలు పుంజు కుంటాయని చెబుతున్నారు. ప్రస్తుతం శ్రావణమాసం కావడం, ఇతర పూజలు ఉన్నందున చికెన్ ధర రూ.150కి తగ్గిందని చెబుతున్నారు.

మంచంపట్టిన పల్లెలు

- విషజ్వరాలతో ప్రజలు విలవిల
- దోమల విజృంభణతో పెరుగుతున్న రోగులు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

ప్రజాశక్తి-గన్నవరం : విషజ్వరాలతో పల్లెవాసులు వణుకుతున్నారు. టైఫాయిడ లక్షణాలతో బాధపడుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శ ఉంది. విష జ్వరాలతో జనాలు మంచం పట్టినా పట్టించుకునే నాధుడు లేరని జనాలు వాపోతున్నారు. ప్రతి ఇంటిలో జ్వరంతో బాధపడుతున్న వారున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు కిటకిటలాడుతున్నారు. డెంగీ లక్షణాలు కనిపించడంతో విజయవాడ పంపుతున్నారు. ముఖ్యంగా జ్వరం, వాంతులు, కీళ్ల నొప్పులు వంటి రకాల లక్షణాలకు తోడు రక్త పరీక్షల్లో ప్లేట్లెట్స్ తగ్గాయని రావడంతో కంగారు పడుతున్నారు. వైద్యం కోసం కార్పోరేట్ ఆసుపత్రికి వెళితే రూ.1లక్ష నుండి రూ.2 లక్షలు లాగేస్తున్నారు. పేదలు అప్పులు చేసి చికిత్సలు పొందుతున్నారు. విష జ్వరాలుగన్నవరం, వీరపనేనిగూడెం, తెంపల్లి, కేసరపల్లి, ముస్తాబాద్, అల్లాపురం, బుద్దవరం, విఎన్పురం, కొత్తగూడెం, చనుపల్లివారిగూడెం, జక్కులనెక్కలం, అజ్జం పూడి గ్రామాల్లో అధికంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వానలకు తోడు పారిశుద్ధ పనులు చేయకపోవడంతో దోమలు విజంభిస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా జనాలపై దాడులు చేసి రోగాలు వ్యాపింపజేస్తున్నాయని, ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాల్వలో దోమల నియంత్రణకు మందులు పిచికారీ చేయడం లేదు. దోమల ఉత్పత్తి పెరిగిపోతోంది. ఆసుపత్రుల్లో మందులు కూడా అందుబాటులో ఉండటం లేదని తెలిపారు. దోమలపై దండయాత్ర చేయడం లేదు. ఎందుకంటే పంచాయతీల్లో నిధులు నిండుకున్నాయని అధికా రులు చెబుతున్నారు. గత నాలుగు రోజులుగా పల్లెలో విషజ్వరాల రోగుల సంఖ్య పెరుగుతోందని చెప్పారు. ఆర్ఎంపి, ప్రవేటు ఆసుపత్రులు రోగు లతో నిండిపోయాయి. ప్లేట్లెట్స్ పడిపోవడంతో బొప్పాం జ్యూస్ కోసం ఎగబడుతున్నారు. ఇదే అవకాశంగా భావించిన వ్యాపారులు వాటి రేటు పెంచేశారు. బొప్పాయి కాయ రూ.50 నుండి రూ.100 అమ్ముతున్నారు. ప్రవేట్ ఆసుపత్రుల్లో దోపిడీ పెరిగింది. రోగి ఆసుపత్రికి వెళితే రూ.5 వేల నుండి రూ.20 వేలు బిల్లు అవకుండా బయటకు పంపడం లేదని రోగులు చెబుతున్నారు. ముఖ్యంగా మెడికల్ క్యాంపులు పెట్టి రోగులకు చికిత్సలు అందించాలని జనాలు కోరుతున్నారు.

గ్రామాల్లో మెడికల్ క్యాంపులు పెట్టాలి: సిపిఎం

విష జ్వరాలు, టైఫాయిడ్ లక్షణాలతో అల్లాడుతున్న ప్రజలను రక్షించడానికి ప్రభుత్వం వెంటనే మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సిపిఎం గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. గత 10 రోజులుగా పల్లెలు మంచం పట్టాయన్నారు.

పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వర్ల కుమార్‌రాజా

పాఠశాల భవనం ప్రారంభం

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని యలమర్రు గ్రామంలో 25 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల-1 భవనాన్ని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆదివారం ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు టి స్వాతి, గ్రామ సర్పంచ్ కొల్లూరు అనూష, జడ్పీహెచ్ఎం రావెళ్ళ వరుణ కుమార్, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, ఆ పార్టీ పార్లమెంట్ నాయకులు సురపనేని వెంకట సత్యనారాయణ, చప్పిడి కిషోర్, కలపాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అదే గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ముఖ మండపం శంకుస్థాపన కార్యక్రమంలో కూడా ఎంఎల్ఎ కుమార్‌రాజా పాల్గొన్నారు.

కృత్రిమ కాలు అందజేస్తున్న దృశ్యం

కృత్రిమ కాలు అందజేత

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : వైద్యుని నిర్లక్ష్యంతో ఎడమ కాలును కోల్పోయిన మహిళకు మచిలీపట్నం నవచైతన్య మదర్ తెరిసా సేవా సమితి ఆదివారం కృత్రిమ కాలును, ఏడు వేల నగదు ఆర్థిక సహాయం అందజేశారు. మచిలీపట్నం 50వ డివిజన్ గనిపిశెట్టి గోపాల్ నగర్ చెందిన నత్త శారద కుమారి (59) భర్త పోస్టల్ డిపార్ట్మెంట్ లో పనిచేసి చనిపోయారు. ఆమెకు నలుగురు ఆడపిల్లలు. గత సంవత్సరం డిసెంబర్ లో తన కాలిపై వచ్చిన మచ్చను చూపించుకోవడానికి స్థానిక వైద్యుడు వద్దకు వెళ్లింది. డాక్టర్ నిర్లక్ష్యం వల్ల శిక్షణ పొందని నర్సు ఇచ్చిన ఇంజక్షన్ వల్ల ఆవిడ కాలుకు పూర్తి ఇన్ఫెక్షన్ జరిగి ఎడమ కాలును మోకాలు వరకు తీసివేశారు. విషయం తెలుసుకున్న మదర్ తెరిసా సేవా సమితి సభ్యులు ఆమెకు అండగా నిలిచారు.సమితి అధ్యక్ష కార్యదర్శులు పైడిపాముల గురు ప్రసాద్, కుమ్మరి జలా చంద్రుడు, సమితి సభ్యులు పద్మనాభుని శేఖర్, లంకే నాంచారయ్య దివ్యాంగురాలు ఇంటికి వెళ్లి 15 వేల రూపాయలు ఖరీదు చేసే కత్రిమ కాలును అందజేశారు. ఆమెకు కావలసిన మందులు మరియు ఫిజియోథెరపీ నిమిత్తం సమితి గౌరవ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ 5,000, కార్యదర్శి కుమ్మరి జలాచంద్రుడు 2,000 రూపాయలు నగదును అమె కుమార్తె సాహితి కి అందజేశారు.

కైతేపల్లి దాస్ ఎన్నిక

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి, పురిటిగడ్డ స్కూల్ కాంప్లెక్స్ సెక్రటరీగా కైతేపల్లి దాస్ ఎన్నికైనట్లు మండల విద్యాశాఖ అధికారి 2 పరిశే వెంకటేశ్వరరావు తెలిపారు. చల్లపల్లి మండలం పురిటి గడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన సమా వేశంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కైతేపల్లి దాసు ఎన్నికయ్యారు. దాసు స్థానిక నారాయణరావు నగర్ ఎంపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు పని చేస్తున్నారు. దాస్ ఎన్నిక పట్ల మండల విద్యాశాకాధికారి, వెంకటేశ్వరరావు, పురిటి గడ్డ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేబీఎన్ శర్మ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం జరుగుతుందని జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ హాలులో ఉదయం 10:30 గంటల నుండి నిర్వహించే మీకోసం కార్యక్రమం లో ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం జరుగుతుందని, కాబట్టి ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఇన్చార్జ్ కలెక్టర్ ప్రజలను కోరారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని యాత్రికులు అధిక సంఖ్యలో ఆదివారం దర్శించుకున్నారు. సుమారు 25 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి దేవస్థానానికి విచ్చేసిన యాత్రలకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్‌బాబు ఏర్పాట్లు పరిశీలించారు. అమ్మవారి దేవస్థానం వద్ద ఈనెల 19వ తేదీ సోమవారం పౌర్ణమి సందర్భంగా చండీ హెూమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

'స్వచ్ఛ సుందర చల్లపల్లి' స్ఫూర్తిదాయకం

స్వచ్ఛ చల్లపల్లిలో పాల్గొన్న మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-చల్లపల్లి : స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం స్ఫూర్తిదాయకమని గుంటూరు మెడికల్ కాలేజ్ 1974 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అన్నారు. ఆదివారం గుంటూరు మెడికల్ కాలేజ్ 1974 బ్యాచ్ పూర్వ విద్యార్థులు చల్లపల్లి గ్రామాన్ని సందర్శించారు. తమ స్నేహితులు డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ - డాక్టర్ టీ.పద్మావతి ఆధ్వర్యంలో 3,207 రోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమంలో భాగస్వాములు అయ్యారు. స్థానిక జాతీయ రహదారి-216కు ఇరువైపులా కొబ్బరి, మామిడి, ఇతర నీడనిచ్చే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గుంటూరు మెడికల్ కాలేజ్ 1974 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ గ్రామ అభివద్ధి, స్వచ్ఛత, సుందరీకరణకు స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ - డాక్టర్ టీ.పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం చల్లపల్లి రూపురేఖలను సమూలంగా మార్చుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి గ్రామ ప్రజలు ఎలాంటి బాధ్యత తీసుకోవాలో చల్లపల్లి గ్రామాన్ని సందర్శించి తెలుసుకునే స్థాయిలో డీఆర్కే దంపతులు, స్వచ్ఛ కార్యకర్తల కషి ఉందన్నారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ - డాక్టర్ టీ.పద్మావతి, సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్‌కు నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : స్వాతంత్ర సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 79వ వర్ధంతిని నాగాయలంకలో సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఆదివారం సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఎంపీటీసీ లంకె శ్రీనివాస ప్రసాద్ పూలదం డలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు లకనం నాగాంజ నేయులు కర్రీ కష్ణమూర్తి మల్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

పెరుగుతున్న సుబాబుల్ విస్తరణ

సాగుపై రైతుల మొగ్గు

ప్రజాశక్తి వత్సవాయి : అతివృష్టి, అనావృష్టిలతో ఎప్పుడూ నష్టపోతున్న రైతుకు వ్యవసాయం చేయాలంటేనే పెను సవాల్‌గా మారుతోంది. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన పంటలేమో చేతికి రావు. ఒకవేళ వచ్చినా ధరలుండవు. ఇలా వ్యవసాయమంటేనే రైతులు భయపడే పరిస్థితులొచ్చాయి. దీంతో కొందరు సుబాబుల్ వైపు చూస్తున్నారు. ప్రస్తుతం ఒక ఎకరం సుబాబుల్ కర్ర లక్ష వరకు ధర పలుకుతుంది. మూడు సంవత్సరాలకు ఎకరానికి రూ.20వేలు కూడా ఖర్చు ఉండకపోవడంతో భూములు ఎక్కువగా ఉన్న రైతులుతో పాటు కొద్దిపాటి భూములున్న వాళ్ల కూడా సుబాబులు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటివరకు మండలంలో వెయ్యి ఎకరాల వరకు సాగు చేపట్టినట్లు అధికారులు తెలుపుతున్నారు. ఒక టన్ను సుబాబులకర్ర 7000 రూపాయల వరకు ఉండటంతో చిన్నకారు రైతులు కూడా సుబాబుల్ సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. ఇంకా రెండు మూడు నెలల్లో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు.

సుబాబులు ఆశా జనకం

: తమ్మినేని రమేష్

రైతు, రైతు సంఘం నాయకులు

తమ్మినేని రమేష్ మాట్లాడుతూ సన్న చిన్న కారు రైతులు వ్యవసాయం చేయటం వలన అప్పుల్లో కూలిపోయి తీవ్రంగా నష్టపోతున్నారని, ఒకపక్క గిట్టుబాటు ధర లేక, గిట్టుబాటు ధరలు ఉంటే పంటలు పండగ రైతులు నష్టపోయి అప్పుల్లో కూరుకు పోతున్నారని తెలిపారు. దానివల్ల రైతులు సుబాబులు పంట వైపు మొగ్గుచూపుతో పెట్టుబడి కూడా తగ్గడంతో ఈ పంట ఆశాజనకంగా ఉందని రైతులు స్వభావపంట వైపు మొగ్గుచూపుతున్నారు. పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువగా రావడంతో రైతులు సుబాబుల్ చేస్తున్నారు. సుబాబుల్ కర్ర టన్ను ఐదు వేల రూపాయల నుండి 7000 రూపాయల వరకు ధర ఉండటంతో రైతులు ఆసక్తి చూపటమే కాకుండా ఈ రెండు నెలల్లో ఇంకా 200 ఎకరాలకు పైగా పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

రహదారి పైనే మురుగు నీరు

ప్రజాశక్తి - మైలవరం : రహదారిపైనే మురుగు నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని కొత్త చంద్రగూడెం ప్రధాన రహదారిపై రోజుల తరబడి నీరు నిలవ ఉండటంతో మురుగుగా ఏర్పడి దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ఏ కొద్దిపాటి వర్షం పడిన పల్లంగా ఉన్న రహదారిపైకి నివాసాల్లోని, వాడుక నీరు, వర్షపు నీరు చేరుతుంది. ఈ రహదారి కొండ మైలవరం నుండి పలు బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. వాహనాలు వెళ్ళే సమయంలో మురుగునీరు చింది స్థానికులపై పడటంతో పోట్లాడుకున్న సంఘటనలు గతంలో జరిగాయి. అధికారులు స్పందించి ప్రధాన రహదారిపై ఏర్పడిన మురుగునీరును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

దేవస్థానానికి ట్రాక్టర్ బహూకరణ

పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానానికి ఆదివారం పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన కర్ల భాస్కరరావు పద్మావతి కుమారుడు కర్ల శ్రీను పద్మావతి కుమారుడు ఆదిత్య కోడలు సాయి భవ్య ఆరు లక్షల విలువగల స్వరాజ్ ట్రాక్టర్‌ను దేవస్థానానికి విరాళంగా ఇచ్చారు. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న అనంతరం డిప్యూటీ కమిషనర్ లీలా కుమార్‌కు అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు ఆలయ మాజీ చైర్మన్లు నూతలపాటి చెన్నకేశవరావు, వాసిరెడ్డి బెనర్జీ, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు

ప్రజాశక్తి - వత్సవాయి : వత్సవాయి మండలంలో చిల్లకల్లు వైరా రహదారిపై లింగాల నుంచి వత్సవాయి వెళ్లే మార్గంలో మలుపు దగ్గర అత్యంత ప్రమాదకరంగా ఉంది. వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి ప్రమాదం జరిగే అవకాశాలు చాలా ఉన్నాయి. గతంలో ఇక్కడ ఆర్డబ్ల్యూఎస్ అధికారులు రోడ్డు మధ్యలో గుంట తీసి మరమ్మతులు చేశారని, ఆ తర్వాత ఆర్‌అండ్‌బి వారు దానిపైన తారు రోడ్డు వేయకుండా వదిలేశారని స్థానికులు చెబుతున్నారు. ఇదే మార్గంలో మండల అధికారులు ప్రతిరోజు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని, ఆర్‌అండ్‌బి, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు స్పందిస్తే ప్రమాదాలు జరగకుండా చూడొచ్చని స్థానికులు కోరుతున్నారు. హెచ్చరిక, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో గంటాల వెంకట జోగయ్య జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఆధ్వర్యంలో ఆస్టర్ రమేష్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ విజయవాడ వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీరాం తాతయ్య వైద్యులు, నాయకులతో కలిసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విజయవాడతో పాటు గుంటూరు వంటి ప్రాంతాల్లో కూడా రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గతంలో జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రిలో టెలీ మెడిసిన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జగ్గయ్యపేట పట్టణంలో ఒక ఆసుపత్రిని ఏర్పాటు చేశారని దాని ద్వారా గుండె, క్యాన్సర్ ఆర్థోపెడ్, నరాలు జనరల్ వంటి చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. జగ్గయ్యపేటలో రమేష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నడుస్తున్న వైద్య సేవలను మరింత విస్తృతంగా అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జగ్గయ్యపేటలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో మందులు అందజేయడంతో పాటు మెరుగైన వైద్యం కోసం విజయవాడ వెళ్లేలా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ కంచేటి గీతారాణి, పేరం సైదేశ్వర రావు, గొట్టే నాగరాజు, కటికల అనిల్, మారేపల్లి శౌరి, బండ్ల జ్ఞాన్ ప్రకాష్, పితాని శ్రీనాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీలు

విస్సన్నపేట మండలంలో...

విజయవాడలో...

ప్రజాశక్తి - విస్సన్నపేట : స్థానిక విస్సన్నపేట గాంధీ బొమ్మ సెంటర్ నుండి అంబేద్కర్ బొమ్మ సెంటర్ వరకు కలకత్తాలోని జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ నిరసనగా లైన్స్ క్లబ్, వాసవి క్లబ్, వాకర్స్ క్లబ్ విస్సన్నపేట వారి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వుయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు.తాతకుంట్ల గ్రామం పేరాబత్తుల దళితవాడలో స్థానికులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు అత్యధికంగా భారతదేశంలోని జరుగుతున్నాయన్నారు. న్యాయ వ్యవస్థ తగు చర్యలు తీసుకొని అత్యాచారం కట్టాలని నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. కొందరు మహిళలు మాట్లాడుతూ ఆడవారిపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని ఆడ పిల్లల్ని ఎక్కడికి పంపాలన్నా ఇలాంటి దుర్మార్గపు చర్యలు అత్యాచారాలు చూసి భయపడాల్సి వస్తోందన్నారు. నిందితులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. **విజయవాడ :** కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అమానవీయ ఘటనను నిరసిస్తూ నగరంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ షిబ్లీ సూచన మేరకు ఎంహెచ్‌పిఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షబానా మాట్లాడుతూ హత్యా ఉదంతం ఒళ్ళు జలదరింపజేసేలా ఉందని అన్నారు. షిబ్లీ మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఆడవారిపై ఇటువంటి ఘటనకు పాల్పడాలంటే భయాన్ని కలిగించేలా ఆ శిక్షలు ఉండాల న్నారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెహ్వార, ఉపాధ్య క్షులు ఫాతిమా, మాట్లా డుతూ నేటి సమాజంలో పురుషులతో సమానంగా దేశానికి సేవలు అందిస్తున్న మహిళలు ఇలాంటి ఘటనలకు గురవడం ప్రతి ఒక్కరి మనసులను కలిచి వేస్తుందన్నారు..

ఎన్‌టిటిపిఎస్‌లో ఉద్యోగాల పేరుతో ఘరానా మోసం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : విటిపిఎస్‌లో ఉద్యోగాల పేరుతో ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. కొండపల్లి శ్రామిక నగర్ ప్రాంతానికి చెందిన మహిళలు సుమారు రూ.24 లక్షలు తీసుకున్నట్లు బాధిత మహిళ విజయవాడ పోలీస్ కమిషనరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసింది. సదరు బాధిత మహిళ కుమారుడు బీటెక్ చేసి ఖాళీగా ఉండటంతో విటిపిఎస్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని సాకుతో తన వద్ద డబ్బులు వసూలు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజా పరిష్కార వేదిక నుంచి వచ్చిన ఫిర్యాదును ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

డిపిఆర్‌టియు రాష్ట్ర కౌన్సిలర్‌గా అజ్మీర్

ప్రజాశక్తి వత్సవాయి : వత్సవాయి మండలంలోని మక్కపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అజ్మీర్ శ్రీనివాసరావు డిపిఆర్‌టియు రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలోని డెమొక్రటిక్ పిఆర్‌టియు రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి.శ్రీను అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. డిపిఆర్‌టియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శులు సూరిబాబు చిత్రాలు వెంకటేశ్వ రావు వత్సవాయి మండల అధ్యక్ష కార్యద ర్శులు మొంగియా నాయక్, బెల్లంకొండ పూర్ణయ్య జిల్లా ఉపాధ్యక్షులు, భాను ప్రసాద్, అజ్మీర్ వెంకటప్పయ్య హర్షం ప్రకటించారు.

వృద్ధ దంపతులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : పశ్చిమ ఇబ్రహీంపట్నంలో నివాసముంటున్న వృద్ధ దంపతులు గాడి అప్పలనాయుడు కొండమ్మలకు టిడిపి నేత రావి ఫణి ఆర్థికచేయుత అందించారు. వృద్ధ దంపతులకు జీవనం కష్టంగా మారడంతో రావి ఫణి యువసేన ఆధ్వర్యంలో రూ.11 వేల నగదు సేకరించి ఆ దంపతులకు ఆదివారం నివాసానికి వెళ్లి అందించారు. ఈ కార్యక్రమంలో జల్లి కాంతారావు రావి ఫణి యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ గిరికి సన్మానం

ప్రజాశక్తి - విసన్నపేట : తన సొంత నిధులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న టిడిపి అభిమాన నాయకుడు ఎన్ఆర్ఐ వల్లభనేని గిరిబాబును ఆదివారం బహుజన దళిత ఐక్యవేదిక నాయకులు సత్కరించారు. చిన్న వయసైనా పెద్ద మనసుతో మండలంలోనే కాకుండా నియోజక వర్గ స్థాయిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన గిరిని సన్మానించారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : హంసలదీవి బీచ్ ఘటనలో మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుం టుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ హామీ ఇచ్చారు. అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో హంసలదీవి బీచ్ ఘటన బాధితులను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆయన తనయుడు మండలి వెంకట్ రామ్ పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గుడివాడ నుంచి వచ్చిన పర్యాటకులు తీరంలో ఉన్న సమయంలో రెండు పెద్ద అలలు రావడంతో ప్రమాదం జరగడం దురదష్ట కరమన్నారు. మెరైన్ సిబ్బంది తక్షణమే స్పందించగా ఒక మహిళ మతి చెందటం, మరొకరు గల్లంతు కావడం బాధాకరమన్నారు. ఈ సంఘటనలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న షేక్ అసిన్ కౌసర్, షేక్ ఆఫ్రిన్, షేక్ కరీములను కాపాడిన మెరైన్ పోలీసులను అభినందిస్తూ వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. కాగా ఈ సంఘటనలో షేక్ పజాల మతి చెందగా షేక్ ముషరాఫ్ అనే వ్యక్తి గల్లంతయ్యారు. గల్లంతైన ముషరాఫ్ కోసం పోలీసులు గాలిస్తున్నందున వీలైన మేరకు త్వరితగతిన ముషరాఫ్ ఆచూకీ కనుగొనాలని మెరైన్ పోలీసులకు సూచించారు. బుద్ధ ప్రసాద్ వెంట జనసేన పార్టీ అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు బాధితులను పరామర్శించిన వారిలో ఉన్నారు

బాధితురాలని పరామర్శిస్తున్న బుద్ధ ప్రసాద్ తదితరులు

తల్లిని కోల్పోయిన చిన్నారులు

హంసలదీవి బీచ్‌లో ఆదివారం చోటు చేసుకున్న సంఘటనలో షేక్ పజాల మృతి చెందగా ఆమె ఇరువురు పిల్లలు హదయపూర్వకంగా రోదిస్తున్నారు. ఆమె మృతదేహాన్ని అవనిగడ్డ ఏరియా వైద్యశాలకు తరలించగా వారి చిన్నారులను కూడా అవనిగడ్డ ఏరియా వైద్యశాల వద్దకు తీసుకువచ్చారు. ఉత్సాహంగా విహార యాత్రకు వచ్చి సముద్రపు కబళించడంతో తల్లి మృత్యువాత పడగా బిడ్డలు దిక్కులేని వారిగా మిగిలిపోయారు. వారు తమ తల్లి కోసం ఏడుస్తున్న తీరు చూపర్లను సైతం కంటతడి పెట్టించింది.

తల్లి మరణంతో దిగాలుగా కూర్చున్న చిన్నారులు

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సేవలో మంత్రి కొల్లు

ప్రజాశక్తి- మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అధికారులు, ఆలయ పండితులు, అర్చక స్వాములు ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ స్వామి వారిని దర్శించుకునగా, ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొల్లు రవీంద్రని ఆలయ సూపర్డెంట్ బొప్పన సత్యనారాయణ, ఆలయ సిబ్బంది, వేద పండితులు మరియు అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలను అందించారు. మంత్రి రవీంద్ర వెంట మండల టీడీపీ నేతలు నడకుదిటి జనార్ధనరావు మెదబలిమి మల్లిఖార్జునరావు రావి నాగేశ్వరరావు తదిరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర

దేవాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం కాశీగూడెం రామాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్మాణదాత వడ్లమూడి సరోజినీ నిర్వహిం చారు. పురాత కాలం నుండి రాముని వాని ఆలయంలో ఆ గ్రామస్తులు నిత్యం ఆరాధించేవారు. ఆలయం శిధిలవస్థకు చేరుకో వడంతో కవుతరం గ్రామ ప్రముఖులు స్వర్గీయులు వడ్లమూడి రమేష్ బాబు సతీమణి వడ్లమూడి సరోజినీ సుమారు 20 లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆదివారం తెల్లవారు జామున ఘనంగా నిర్వహించారు. గ్రామ కమిటీ,గ్రామస్తులు ఆమెకు ధన్యవాదాలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి పార్టీ నాయకులు ఎం సుబ్రహ్మణ్యం, బొబ్బా. నరసింహారావు, శేషబాబు, నాగయ్య, ఆలయ కమిటీ సభ్యులు ముద్దాల జగన్, పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం 1వ వార్డు లోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి 114వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మురాల వెంకటేశ్వరరావు, పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో కవుతరం, కూరాడ, గుడ్లవల్లేరు గ్రామాల్లో అమ్మవారి ప్రభను వైభవంగా, వివిధ వేషధారణలు, తప్పు, తీన్మార్, అనేక రకాల వైద్యాలతో ఊరేగింపు నిర్వహించారు.

20న అడిగోపుల వెంకటరత్నం సంస్మరణ సభ

ప్రజాశక్తి - ఎఎన్‌యు : అభ్యుదయ కవి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేసిన అడిగోపుల వెంకటరత్నం సంస్మరణ సభను ఈనెల 20వ తేదీన ఉదయం 11 గంటలకు తెలుగు మరియు ప్రాచ్య భాష విభాగం, పెన్షనర్స్ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ కె.గంగాధర్‌రావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ చల్లపల్లి స్వరూప రాణి, ప్రొఫెసర్ పి.వరప్రసాద్‌మూర్తి, ఎన్.రంగయ్య, రావెల సాంబశివరావు, సిఎస్ఎన్ రాజు, వాసా మాణిక్యాలరావు, డాక్టర్ ఎన్‌వి ష్ణారావు హాజరుకానున్నారని చెప్పారు.

పాఠశాలలో నీటి పంపులు ప్రారంభం

ప్రజాశక్తి-మంగళగిరి : సికె హైస్కూలులో విద్యార్థులు తమ భోజనం క్యారేజీ పాత్రలు శుభ్రం చేసుకోవడం కోసం ప్రత్యేకంగా ఒక వాష్ బేసిన్, నీటి పంపులు, దానికి ప్లాట్ ఫాం వసతి సౌకర్యాలను స్కూల్ కమిటీ కరెస్పాం డెంటు చింతక్రింది కనకయ్య ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ సెక్రటరీ జంజనం పాండురంగారావు, కమిటి మెం బరు దామర్ల కుబేర స్వామి పాల్గొన్నారు. నీటి కుళాయి వసతిని ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థి దామర్ల శంకర శ్రీనివాసరావును వారి తోటి సహాధ్యాయులు సత్కరిం చారు. 1982 పదవ తరగతి పూర్వ విద్యార్థుల బ్యాచ్ తర పున వారి ప్రతినిధులు రావెల శ్రీనివాసరావు, తాడికొండ తిరుమల రావు, ఇంటెలిజెన్స్ సి.ఐ దేవుళ్ళ పుల్లయ్య, విక్రమ్ రెడ్డి, ఇంజమూరి నరేంద్ర,పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి : మంగళగిరి పట్టణంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలను నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షులు వాకా మాధవరావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సర్దార్ గౌతు లచ్చన్న గౌడ కమ్యూనిటీ హాలులో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర గౌడ సంఘ అధ్యక్షులు వాకా రామ్ గోపాల్ గౌడ్ పాల్గొని, విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాకా రామ్ గోపాల్ గౌడ్ , నియోజకవర్గ గౌడ సంఘ అధ్యక్షుడు వాకా మాధవరావు మాట్లాడుతూ సుమారు 350 ఏళ్ల క్రితం ఆనాటి మొఘల్ పాలకుల దౌర్జన్యాలకు, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఛత్రపతి శివాజీ సమకాలికులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని పేర్కొన్నారు. నాయకులు కంచర్ల కాశయ్య, ఎనుముల నర సింహారావు, తాత కోటయ్య, తాత సాంబశివరావు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-పమిడిముక్కల : గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అధికా రులు కృషి చేయాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఆదివారం పమిడి ముక్కల మండలంలోని హనుమంతపురం, వీరంకిలాకు తదితర గ్రామాలలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామా లలో విద్యుత్తు, తాగునీరు, పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని ఆయన కోరారు. హనుమంతపురం గ్రామంలో గ్రామ చెరువులో జల స్తూపం ఆవిష్కరించారు. గోరంట్లాకు అంకమ్మ గుడిలో జాతర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ వై చిట్టిబాబు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు లింగమనేని రామారావు. పెద్దలు పాల్గొన్నారు

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం గూడూరు గ్రామ పంచాయతీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వార్డు మెంబర్లు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆది వారం గూడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతనస్వామి ఆద్వర్యంలో అమరావరపు వెంకట సుబ్బారావు,శాకల శ్రీహరి, దేవనబోయిన వెంకటరమణ, కొత్త గుండు నాగ వెంకటలక్ష్మి, లకు తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఏ బేగ్,గొరిపర్తి ఫణి రాజు, యర ప్రసాద్,డొక్కు నాగరాజు,బేతల స్వామి,పోతన వెంకటేశ్వరమ్మ, డొక్కు లక్ష్మీ నిరోష పాల్గొన్నారు.

20న బిఎస్‌సి సమావేశాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గుడివాడ : కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో బిసి కులగణన నిర్వహించాలని, బిసిలకు జనాభాను బట్టి పార్లమెంట్, అసెంబ్లీలలో సీట్లు రిజర్వ్ చేయాలని కోరుతూ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే సమావేశాన్ని విజయ వంతం చేయాలని బిఎస్‌పి జిల్లా కన్వీనర్ దారం కరుణాకర్ అన్నారు. ఆదివారం స్థానిక పాత కోర్టు సమీపంలోని బిఎస్‌పి కార్యాలయంలో బిసి కులగణన అంశంపై జరిగే రౌండ్ టేబుల్ సమావేశం బ్రోచరును బిఎస్‌పి జిల్లా ఇన్‌చార్జి దారం కరుణాకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదిన విజయవాడలోని శ్రీపాద హోటల్‌లో జరిగే శ్రీనారాయణగురు జయంతి సందర్భంగా బిసి కులగణనపై బి.సి అసెంబ్లీ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో కులగణన నిర్వహించి స్థానిక సంస్థలలో నామినేటెడ్ పదవులలో బిసిలకు రిజర్వేషన్ ఇవ్వాలని, విద్యా, ఉద్యోగాల్లో బిసి జనాభాను బట్టి కోటాలను నిర్ణయించి ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు ఇచ్చిన హామి మేరకు బిసి రక్షణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలని, తదితర అంశాలపై జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి బిసి సంఘాలు, బిసి కుల సంఘాలు, బిసి మేధావులు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బిఎస్‌పి నియోజవర్గ అధ్యక్షులు ముప్పరి మరియబాబు, పాల్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై బ్రోచరును విడుదల చేస్తున్న బిఎస్‌పి నాయకులు

క్వాడ్ ప్రో కార్ల షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రస్తుతం కార్ల వినియోగం బాగా పెరిగింది. యువత కారును తమకి నచ్చిన రీతిలో ఉంచుకునేందుకు ఎక్కువగా ఇష్టపడుతున్నారని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. కామినేని నగర్‌లోని మహానాడు రోడ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన క్వాడ్ ప్రో షోరూమ్‌ను ఆదివారం గనులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంఎల్ఎ బోడే ప్రసాద్‌లతో కలిసి ఎంపి కేశినేని శివనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ యజమాని మహ్మద్ ఖాదర్ షాకు శుభాకాంక్షలు తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు.

రద్దీగా రాఖీల దుకాణాలు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ గాంధీ సెంటర్లో రాఖీ పండుగ సందర్భంగా ప్రత్యేక షాపులు నిర్వహించారు. హిందువులు ఎంతో పవిత్రంగా జరుపుకునే శ్రావణమాసంలో రక్షా బంధన్ పండుగకు ఎంతో ప్రత్యేకత ఉంది. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుంది ఈ రక్షాబంధన్. ప్రస్తుతం రాఖి పండుగ సందర్భంగా వివిధ రకాల రాఖిలు ప్రత్యేక ఆకర్షనగా నిలుస్తున్నాయి. గతంలో రక్షా బంధన్ అనగానే మొదటగా రాఖీలుస్పాంజ్‌తో తయారు చేసి వాటికీ మెరుగులు అద్ది చేసేవారు. కానీ ప్రస్తుతం ట్రెండ్‌కు తగ్గటుగా పలు డిజైన్లలో రాఖీలు అందుబాటులోకి వచ్చాయి. అందులో ప్రస్తుతం గోల్డ్ ప్లేటడ్, సిల్వర్ ప్లేటడ్ రాఖిలు ఒక ఎత్తయితే కస్టమైస్డ్ ఫోటో ప్రింటెడ్ రాఖిలు ప్రేత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - గంపలగూడెం: అప్పుల బాధ తాళలేక కౌలు రైతు మృతి చెందినట్లు ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మద్దిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మండలంలోని అనుములంక గ్రామానికి చెందిన చిట్టి బొమ్మ చిన్ని కష్ణ (54) తన పొలములో ఆదివారం సాయంత్రం పురుగుమందు తాగి మృతి చెందినట్లు చెప్పారు. మృతుడు తన పొలంలో విగతజీవిగా పడి ఉండటాన్ని తోటి రైతులు గుర్తించినట్లు చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గడచిన రెండేళ్లుగా తాను చేసిన వ్యవసాయం కలిసి రాక అప్పులపాలై ఈ పరిస్థితుల్లోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

స్వచ్ఛత-శుభ్రత కార్యక్రమాలు

ప్రజాశక్తి- నందిగామ : పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని నందిగామ నియోజకవర్గ అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో జన్మదిన వారోత్సవాలను వివిధ సమాజ సేవా కార్యక్రమాల వారం రోజులపాటు నిర్వహిస్తున్నారు. ఆదివారం నాడు పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత – శుభ్రత కార్యక్రమంగా నందిగామ పట్టణంలో చిన్న బ్రిడ్జి పక్కన పోస్తున్న వ్యర్థాలు, వ్యర్థ ప్లాస్టిక్ కవర్లు, తొలగించి శుభ్రం చేశారు.నియోజకవర్గ అధ్యక్షులు పోలిశెట్టి వరుణ్, చిరంజీవి యువత సభ్యులు పాల్గొన్నారు.

స్రవంతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎంపి శివనాథ్

ఆపరేషన్ థియేటర్‌ను చూస్తున్న ఎంపి, తదితరులు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రాన్నే కాదు, ప్రజల ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోలేదు. అందుకే కేశినేని ఫౌండేషన్ ద్వారా విజయవాడ పార్లమెంట్ పరిధిలో ఉచిత మెడికల్ క్యాంప్స్ నిర్వహించి ప్రజలకు వైద్య సేవ అందించినట్లు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. అశోక్ నగర్‌లోని స్రవంతి హాస్పిటల్స్ మల్టీ స్పెషాలిటీ బ్లాక్ ను ఆదివారం గనులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి ఎంపి కేశినేని శివనాథ్ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్ లతో పాటు ఖమ్మం ఎంఎల్‌సి తాతా మధుసూదన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కేశినేని ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌కి డాక్టర్ శ్రీనివాస్ సనగుండ్ల ఎంతో సహకారం అందించారన్నారు. ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలని డాక్టర్ శ్రీనివాస్ సనగుండ్ల, డాక్టర్ స్రవంతి దేవభక్తునికి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోగ్యశ్రీ విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఆసుపత్రి వైద్యులు, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్థోపెడిక్ విభాగం, గైనకాలజి, జనరల్ మెడిసిన్ వైద్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి : ఎంఎల్‌సి లక్ష్మణరావు

మాట్లాడుతున్న ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : 117 జివో రద్దు చేసి ఉపాధ్యాయుల అన్ని ఖాళీలను డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఎన్‌టిఆర్ జిల్లా యుటిఎఫ్ ఆఫీస్ బేరర్ల సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాఠశాలల విలీన ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో ఒకేచోట ఐదు తరగతులు నిర్వహించి తల్లిదండ్రుల నమ్మకం పొందేలా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి మనోహర్ మాట్లాడుతూ సబ్జెక్టు టీచర్ల కొరత రాష్ట్ర వ్యాప్తంగా ఉందన్నారు. కావున ఉపాధ్యాయులకు నెల వారి పదోన్నతులు ఇప్పించాలన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సుందరయ్య మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మండల జిల్లా రాష్ట్రస్థాయిలో స్వర్ణోత్సవ మహా సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిలా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



ఫిలిం నెగెటివ్‌పై చిత్రం

జగ్గయ్యపేట: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణానికి చెందిన చిత్రకారుడు అల్లి చంద్రశేఖర్ ఫాదర్ ఆఫ్ ఫొటోగ్రఫీగా పేరుందిన లూయిస్ డాగ్యూరే చిత్రాన్ని 35 ఎంఎం రోల్ ఫిలిం నెగటివ్‌పై వినూత్నంగా స్కెచ్ పెన్నుతో చిత్రకరించారు.

మునేటిలోకి దిగి ప్రమాదవశాత్తు గేదెల కాపరి మృతి

ప్రజాశక్తి - వత్సవాయి : గేదెల కాపరి మునేటిలోకి దిగి ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన మండలంలోని పోలంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన మాగం సాయిలు 45 రోజువారి గేదెల తోలుకొని పొలం వెళుతున్నాడు. గేదెలు నీళ్లు తాగడం కోసం మునేటిలోకి దిగాయి. వాటిని మళ్లించడం కోసం మునేటిలోకి దిగగా లోతు ఎక్కువగా ఉండటంతో ప్రమాదవశాత్తు లోయలో పడి మృతి చెందాడు. ఆయనకు భార్య పిల్లలున్నారు. విషయం తెలుసుకున్న జగ్గయ్యపేట సిఐ జానకిరామ్, వత్సవాయి ఎస్ఐ ఉమామహేశ్వరరావు, తహశీల్దార్ నరసింహారావు, తదితరులు సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం లభ్యం కాలేదు. మృతుని బంధువులు కన్నీరు మున్నీరుగా వినిపిస్తున్నారు. వత్సవాయి ఎస్ఐ ఉమా మహేశ్వర రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిద్ధమవుతున్న 72 అడుగుల మట్టి వినాయకుడి విగ్రహం

ప్రజాశక్తి - భవానీపురం : వినాయక చవితి నేపథ్యంలో సితార సెంటర్‌లోని స్టేడియం స్థలంలో 72 అడుగుల భారీ మట్టి విగ్రహం తయారీలో నిమగ్నమయ్యారు కార్మికులు. వినాయకుడు బొమ్మను తీర్చిదిద్దే పనిలో 26 రోజులుగా ఉన్నామని, మరో పది రోజుల్లో పూర్తి చేస్తామని ఆర్టిస్ట్ శివ తెలిపాడు. నగర టిడిపి నాయకులు, తెలుగు వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు డూండి రాకేష్ ఆధ్వర్యంలో డూండీ గణేష్ సేవా సమితి నేతృత్వంలో ఈ ఏడాది వైభవోపేతంగా నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలకు కోసం 72 అడుగుల మహా మట్టి గణపతి నిర్మాణం పనులు 30 మంది కార్మికులతో వేగవంతంగా సాగుతున్నాయి. కృష్ణా జిల్లా ఘంటసాలకు చెందిన గుత్తికొండ శివ తిరుమల తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రెడిషనల్ ఆర్ట్, కల్చరల్‌లో డిప్లొమా చేశానని తెలిపాడు. బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్‌కు సంబంధించిన లలిత కళల్లో శిక్షణ పొంది నైపుణ్యం సాధించినట్లు శివ తెలిపాడు. ఈ ఏడాది జూలై 22న స్టేడియం స్థలంలో డూండీ గణేష్ సేవా సమితి వారి 72 అడుగుల మట్టి వినాయకున్ని 30 మంది సిబ్బందితో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపాడు. ఈ మట్టి విగ్రహం మూడు లేయర్స్‌తో చేయాల్సి ఉందన్నాడు.

తయారీ విధానం :

మట్టి విగ్రహంకు కావాల్సిన బంకమన్నును హైదరాబాద్ నుంచి తెప్పించారు. తొలుతగా 72 అడుగుల ఎత్తులో ఐరన్‌తో తీర్చిదిద్ది, దాని చుట్టూ మెస్ అల్లినట్లు చెప్పాడు. దానిలో గడ్డి, ఊక, ఇసుక, జూట్‌ను అమర్చి మట్టి విగ్రహం తీర్చదిద్దుతున్నట్లు చెప్పాడు. ఆర్టిస్ట్ క్లే ఫినిషింగ్‌కు వాడతామని తెలిపాడు. 72 అడుగుల మట్టి వినాయకుని విగ్రహం నమూనాలో మరో వినాయకుని శివ తీర్చిదిద్దుతున్నాడు.

నేడు నూతన పాలకేంద్ర భవనం ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - మైలవరం :

మండలంలోని అనంతవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన పాల కేంద్ర భవనాన్ని సోమవారం ఉదయం ప్రారంభిస్తున్నట్లు అనంతవరం పాల సొసైటీ అధ్యక్షురాలు బొందలపాటి శైలజ, టిడిపి సీనియర్ నాయకులు బొందలపాటి సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పాల్గొంటార న్నారు. టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రక్షా బంధన్

కవితాలయమ్

చెల్లెలికి తోడుగా
కలకాలం నీడగా
కలిసి ఉండేందుకు
రక్షాబంధన్ మనకుందిగా!

రూపం వేరున్నా
మనుషులు ఎక్కడున్నా
అమ్మ ప్రేగు తెంచుకు పుట్టిన
రక్తమే మనదన్నా!

అన్న బంధం అరగనిది
చెల్లి బంధం తరగనిది

అన్నా చెల్లెలి అనుబంధమై
అవనిలో వెలిగింది!

మనస్పర్థలు తొలగించు
రాగాలు పలికించు
రాఖీ బంధం మనకు
ప్రేమలను చిగురించు!

అన్నకు రాఖీ కట్టు
ఆప్యాయత, అనురాగాలను పంచిపెట్టు
నిండు రాఖీ పౌర్ణమిని
భావితరాలకై నిలబెట్టు !

లింగనబోయిన.హనుమంతరావు
గండ్రాయి గ్రామం
9010710201